## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

పలిమెల: మండలంలోని పలిమెల కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఆరు నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులు బోధించేందుకు తాత్కాలిక అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ఎం.భవాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత గల మహిళలు, పీజీసీఆర్‌టీ నర్సింగ్ ఇంటర్మీడియెట్ బోధించుటకు బీఎస్సీ నర్సింగ్ అర్హత గల మహిళలు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు పలిమెల కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గెస్ట్ ఫ్యాకల్టీ కాల వ్యవధి మూడు నెలలు మాత్రమేనని పేర్కొన్నారు.

### చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

రేగొండ: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది హెయిర్ డై తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడతపల్లి గ్రామానికి చెందిన మామిడిశెట్టి సద్గురు (65) అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది వెంట్రుకలకు వేసుకునే కలర్ (హెయిర్ డై) ఈ నెల 9న తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

### పాఠశాలలో వైద్యశిబిరం



కాళేశ్వరం: కాళేశ్వరం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత నిర్వహించారు. సికిల్ సెల్ వ్యాధి గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్ టెక్నిక్స్, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తరుగులేకుండా కొనుగోలు చేయాలి

ములుగు రూరల్: రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం తరుగు లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు పోరిక గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను, తడిసిన ధాన్యం కోతలు లేకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని అన్నారు. బోనస్ ప్రకటించి కొంతమందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటుదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, సానికొమ్ము ఆదిరెడ్డి, గడ్డమీది భాస్కర్, బాబు పాల్గొన్నారు.

### అడవికి నిప్పు మానవాళికి ముప్పు

వాజేడు: అడవికి నిప్పు పెట్టడం మానవాళికి ముప్పని ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి అన్నారు. శుక్రవా రం ఏడ్జర్లపల్లి గ్రామంలో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్ల నాగమణి మాట్లాడుతూ.. అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అడవులు కాలిపోతే స్వచ్ఛమైన ఆక్సిజన్ అందకపోగా సకాలంలో వర్షాలు పడక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, సరోజ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

### 19న మహా పడిపూజోత్సవం

ములుగు రూరల్: అయ్యప్ప స్వామి 18 కలిశాల మహా పడిపూజ కార్యక్రమం ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని రామాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు అయ్యప్ప భక్తమండలి అధ్యక్షుడు గురుస్వామి రమేశ్ తెలిపారు. శుక్రవారం రామాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములతో సమావేశం నిర్వహించి పడిపూజ కార్యక్రమ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10.30 నిమిషాలకు హరిహర క్షేత్ర ప్రధాన అర్చకుడు గురుస్వామి దేవేశమిశ్రా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు నగర సంకీర్తన, ఉదయం 10.30 పడి పూజ, 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో భక్తమండలి గౌరవ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సల్పాల శ్రీనివాస్, భక్తమండలి ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వరస్వామి, ఉపాధ్యక్షుడు పొడాల ఓంప్రకాశ్ గురుస్వామి, కవిరాజు, రాకేష్‌రెడ్డి, శ్రీనాథెడ్డి, చందర్, రవిందర్, రాకేష్‌యాదవ్, కుమార్, జ్జల కుమార్, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.

# రూ.50కోట్లతో కోటంచ రహదారి

- డబుల్ లేన్‌గా భాగిర్థిపేట-కోటంచ రోడ్డు
- తీరనున్న వాహనదారుల కష్టాలు
- నేడు మంత్రుల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన



డబుల్ లేన్‌గా మారనున్న భాగిర్థిపేట-కోటంచ రోడ్డు

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట ఆర్చి నుంచి కోటంచ సింగిల్ రోడ్డుకు మహర్దశ పట్టింది. దాదాపు ఇరవై కిలో మీటర్లు త్వరలో డబుల్ రహదారిగా మారనుంది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి దాదాపు రూ.50 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులకు నేడు (శనివారం) మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ రామన్నగూడెం తండా స్టేజీ వద్ద శంకుస్థాపన చేయనున్నారు.

**తప్పనున్న తిప్పలు..**

భాగిర్థిపేట ఆర్చి–కోటంచ రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో కోటంచ జాతరకు భారీ వాహనాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ప్రస్తుతం రేగొండ మీదుగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. డబుల్ రోడ్డు పూర్తయితే తిప్పలు తప్పుతాయి. మొగుళ్లపల్లి, చిట్యాల మండల ప్రజలకు జిల్లా కేంద్రానికి రాకపోకలు సుగమం అవుతాయి. భాగిర్థిపేట, దుంపిల్లపల్లి, గూడెపల్లి గ్రామాలకు చెందిన పత్తి, మిర్చి వాహనాలు ఏనుమాముల మార్కెట్‌కు వెళ్లేందుకు భాగిర్థిపేట ఆర్చి మీదుగా త్వరగా చేరుకోగలుగుతాయి. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలుగా ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. రోడ్డుకు నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

**ఎమ్మెల్యే గండ్ర చొరవతో..**



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో ప్రభుత్వం భాగిర్థిపేట ఆర్చి నుంచి కోటంచ వరకు రోడ్డును డబుల్‌లేన్‌గా మార్చేందుకు దాదాపు రూ.50 కోట్లు మంజూరు చేసింది. కోటంచ జాతరకు భూపాలపల్లి, ములుగు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు రాకపోకలు సుగమం అవుతాయి.

– షాబీర్, భాగిర్థిపేట

**కష్టాలు తొలగనున్నాయి..**



రోడ్డును విస్తరిస్తే మా కష్టాలు తొలుగుతాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– బోయిని వినోద్‌కుమార్, దుంపిల్లపల్లి

# సీపీఎస్‌ను రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ టీపీయూఎస్ మండల శాఖ అధ్యక్షుడు కానుగుల రఘుపతి ఆధ్వర్యంలో శుక్రవారం భోజన విరామ సమయంలో జడలపేట పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీలు, అమలు చేయాలని , అలాగే బకాయిలు చెల్లించాలని ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొపగాని భాస్కర్, మారబోయిన మహేందర్, మనోహర్, శరత్‌బాబు, లక్ష్మి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుడు శ్రీనివాస్

కాటారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని విలాసాగర్–గుమ్మాళ్లపల్లి రహదారిపై ధర్మసాగర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం అంకుషాపూర్‌కు చెందిన అయిలి శ్రీనివాస్ ధర్మసాగర్‌లోని బంధువుల ఇంట్లో దశదినకర్మకు హాజరయ్యాడు. ఇంటికి తిరుగు ప్రయాణంలో తన బంధువైన బొమ్మాపూర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని గుమ్మాళ్లపల్లి వైపుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి ఎదురుగా వచ్చి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్ రోడ్డుపై పడిపోవడంతో తలకు, శరీర భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మికి సైతం కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ట్రాక్టర్ రోడ్డు పక్కకు దూసుకుపోయి బోల్తాపడింది.ట్రాక్టర్ డ్రైవర్‌కు సైతం గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమయంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

# కార్మికుల రక్షణలో భాగస్వాములు కావాలి

- డైరెక్టర్ ఆఫ్ ఓపీ జీఎం వెంకటేశ్వర్‌రావు





ఓపెన్‌కాస్ట్ మైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మల్హర్: ఓపెన్ కాస్ట్‌లో ఉద్యోగులు, కార్మికులు రక్షణలో భాగస్వాములు కావాలని డైరెక్టర్ ఆఫ్ ఓపీ జీఎం వెంకటేశ్వర్‌రావు సూచించారు. 55వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌ను వెంకట్వేర్‌రావు సందర్శించి, రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. మైన్‌లో కొనసాగుతున్న సేఫ్టీపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. కార్మికులకు రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. 2023 వార్షిక సంవత్సరానికి సంబంధించిన సేఫ్టీ అవార్డును ఏఎమ్మార్ అధికారులకు అందించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ట్రేడ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో సీఈ(కోల్, కమర్షియల్) జీవన్‌కుమార్, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ మూర్తి, మైన్ మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ అధికారి సురేష్‌బాబు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు, సిబ్బంది

భూపాలపల్లి రూరల్: ఉత్తరప్రదేశ్, ఛండీఘర్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం జంగేడు సబ్‌స్టేషన్ ఎదుట భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలని ప్రైవేటీకరణ చేయడం వల్ల వినియోగదారులకు ధరలు పెరుగుతాయన్నారు. రైతులకు, గృహ, పరిశ్రమ వినియోగదారులకు ఇచ్చే సబ్సిడీలు, ఉద్యోగుల సౌకర్యాలు, కార్మిక హక్కులు ఉండవన్నారు. ఈనెల 19న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, 25న ఛలో లక్నో, ఛలో ఉత్తరప్రదేశ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోసరి భాస్కర్, నాయకులు సురేందర్ రెడ్డి, చందు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండలశాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడుతూ.. 75 సంవత్సరాలుగా ఏబీవీపీ విద్యార్థుల కోసం విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి నింపుతూ జాతీయవాదులుగా తయారు చేస్తూ, సామాజిక సేవలు అందిస్తుందన్నారు. సిద్దిపేటలో ఈ నెల 23, 24, 25 నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. సంజయ్, సాయికిరణ్, ప్రకాశ్, వరుణ్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన పొదుపునకు పాటుపడాలి

- తహసీల్దార్ రవీందర్



బహుమతి అందజేస్తున్న సాంబశివరెడ్డి

మంగపేట: ఇంధన వనరుల పరిరక్షణ, పొదుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వికాస్ అగ్రీ ఫౌండేషన్, జాతీయ మిర్చీ టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంధన పొదుపుపై అవగాహన విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఇంధన వనరులను పొదుపు చేసి భావితరాలకు బహుమానంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విరేందర్, ఎస్సై సురేష్‌కుమార్, ఎన్‌పీడీసీఎల్ ఏఈ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యసేవలు అందించాలి

- మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్



వినయ్‌భాస్కర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మల్హర్: వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్లు, సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి రోగులను గుర్తించి వైద్య సేవలందించాలన్నార. గర్భిణుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, పిల్లలందరికీ సరైన సమయంలో టీకాలను వేయాలని సూచించారు. విష జ్వరాలను అరికట్టేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించాలని సూచించారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ వినయ్ భాస్కర్‌ను సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- ఎస్సై గోగికారి ప్రసాద్



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లోకి ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. నేర నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పోలీసులకు సహకరిస్తూ శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై దాట్ల కుమారస్వామి, కానిస్టేబుల్ మహేందర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.


# సీతక్క కృషితో సెంట్రల్ లైటింగ్

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు



సెంట్రల్ లైటింగ్ కోసం మార్కింగ్ చేస్తున్న అధికారులు, నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు పంచాయతీరాజ్ శాఖ నుంచి మంత్రి సీతక్క కృషితో రూ.80లక్షల నిధులు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెంట్రల్ సిస్టమ్ మార్కింగ్‌ను పంచాయతీరాజ్ ఎస్ఈ అజయ్‌కుమార్, డీఈఈ నరేష్ సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ కోసం మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో పనులు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో వై జంక్షన్ నుంచి చేపల మార్కెట్ వరకు సదరు కాంట్రాక్టర్, అధికారులు పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, కన్నాయిగూడెం మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, కందుకూరి రతన్, జిల్లా, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నుంచి వస్తున్న దుమ్ము

# దుమ్ము ఇలా.. వెళ్లేదెలా?

మల్హర్: మండలంలోని కొయ్యూరు నుంచి రుద్రారం వరకు రూ.20 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుపై మట్టి పోయడంతో వచ్చిపోయే వాహనాలతో విపరీతమైన దుమ్ము వస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు నిర్వహిస్తున్న క్రమంలో రోడ్డుపై నీళ్లు సరిగా చల్లటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వచ్చే దుమ్ముతో అనారోగ్యం బారినపడే అవకాశం ఉన్నందని వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకొని రోడ్డుపై నిత్యం నీళ్లు చల్లించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అన్నదానం



స్వామి వారికి నైవేద్యం తీసుకెళ్తున్న శ్రీనివాస్

కాటారం: మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మ శాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ హర్షిత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. అన్నదాత దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, గురుస్వాములు జక్కు మొగిలి, అయిత వెంకన్న, పెండ్యాల రంజిత్, చీమల రాజు, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

## గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న ఎస్సై ప్రసాద్

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి బస్‌షెల్టర్ వద్ద వర్షాకాలంలో ధ్వంసమైన రోడ్డు వల్ల వాహనారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా స్పందించిన ఎస్సై గోగికారి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మొరంతో గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా మొరం తరలింపునకు సహకరించిన దాసారపు భాస్కర్, నల్లబెల్లి మొండయ్యలను ఎస్సై అభినందించారు. గుంతలను పూడ్చివేయుటకు కృషి చేసిన ఎస్సైకి గ్రామస్తులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా హనుమాన్ వ్రతం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ వ్రతాన్ని ఆలయ ఈఓ మహేశ్ ఆధ్వర్యంలో పూజారులు రాధాకృష్ణ, మురళీకృష్ణామాచార్యులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలో పాల్గొన్నారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# బలహీన వర్గాల కోసం పోరాటం



సభ్యత్వం అందజేస్తున్న మల్లికార్జునరావు

వాజేడు: సీపీఐ బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు అన్నారు. మండల పరిధిలోని ధర్మవరం, చంద్రుపట్ల గ్రామాల్లో శుక్రవారం ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. కర్షక, కార్మిక, శ్రామికుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన పార్టీ భారత కమ్యూనిస్టు అన్నారు. సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందని ప్రతీ కార్య కర్త గ్రామ గ్రామాన సంబురాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురికి పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీను, నర్సింహరావు, మణికంఠ, సంతోశ్ తదితరులు ఉన్నారు.